మనసున్న మహారాజు జగనన్న

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రజలంతా ఆర్థికంగా అభివృద్ధి చెంది సంతోషంగా జీవించాలనే ఆకాంక్షతో పాలన సాగిస్తున్న మనసున్న మహారాజు మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలో రైలు ప్రమాద దుర్ఘటనకు చింతిస్తూ రెండు నిమిషాల పాటు నియోజకవర్గం నాయకులతో కలసి మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన సాగించిన ఒకే ఒక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు మరెన్నో సంక్షేమ ఫలాల్ని ప్రజలకు అందించారని చెప్పారు. మరోసారి జగనన్నను మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిని ఎందుకు చేసుకోవాలో నియోజకవర్గం నాయకులు, ప్రజలకు ఆమె వివరించారు. వ్యవసాయ రంగంలో జాతీయస్థాయిలో సాధించిన వృద్ధి రేటు కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించినది ఎంతో ఎక్కువని వెల్లడించారు. పారిశ్రామిక రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానం సాధించిందని వివరించారు. రాష్ట్రం జీడీపీ రేటులో దేశంలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. విశాఖపట్నంలో జరిగిన జీఐఎస్ సమ్మిట్‌లో రూ. 13.5 లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా రాష్ట్రానికి ఏఏ పరిశ్రమలు రానున్నాయో వివరించారు. రైతు భరోసా పథకం, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి పంట విక్రయాల వరకూ ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, వాటిపై రైతుల ఏ విధంగా సంతోషం వ్యక్తం చేస్తున్నారో వెల్లడించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజల ఆరోగ్య భద్రత కోసం జగనన్న ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌లు, ప్రతి ఇంటికి ఫ్యామిలీ డాక్టర్‌తో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య రంగంలో తీసుకు వచ్చిన చారిత్రాత్మక మార్పుల్ని తెలియజేశారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా తీసుకు వచ్చి, వాటికి వలంటీర్ వ్యవస్థను అనుసంధానం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమత, పార్టీలు లేకుండా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు ఏవిధంగా అందిస్తున్నారో తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పాఠశాలలు, ఆసుపత్రుల ఆధునీకరణ చేసి దేశంలోనే ఆంధ్ర రాష్ట్రాన్ని విద్య, వైద్య రంగాల్లో మొదటి స్థానంలో జగనన్న నిలబెట్టిన విధానాన్ని వివరించారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలు తీసుకున్న రుణాల్ని పూర్తిగా దశలవారీగా మాఫీ చేస్తూ, మళ్లీ వారికి ఇప్పించి వాటిపై వడ్డీల్ని ప్రభుత్వమే భరాయిస్తూ, మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ దేశంలోనే అగ్రగామిగా జగనన్న మనల్ని నిలిపారని తెలిపారు. ఆనాడు చంద్రబాబు అధికారంలోకి రాకముందు 600 హామీలు ఇచ్చి ఒక్కటి అమలు చేయలేదని, ఎన్నికల అనంతరం ఎన్నికల మేనిఫెస్టోను సైతం ఆన్‌లైన్‌లో తొలగించి ప్రజల్ని ఏవిధంగా మోసం చేశాడో వివరించారు. మరలా నేడు ప్రజల్ని మోసం చేయాలని పథకాలు పన్నుతున్నాడో తెలియజేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కేవలం జగనన్న ద్వారానే సాధించగలమని, కావున ప్రతి ఒక్కరూ మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల వలే సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, సర్పంచులు, సచివాలయాల కన్వీనర్లు, మండల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

విఘ్నాలను తీర్చే దేవుడు విఘ్నేశ్వరుడు

గుంటూరు రూరల్: భక్తుల విఘ్నాల్ని తీర్చే దేవుడు విఘ్నేశ్వరుడని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 40వ డివిజన్ పెదపలకలూరులోని న్యూ ఎల్ఐసీ కాలనీ తేజ టౌన్‌షిప్‌లో శనివారం ప్రముఖ బిల్డర్ బి.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ షిర్డీ సాయినాథ్ మందిరం, శ్రీ గణపతి దత్తాత్రేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రజలు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, తేజ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణయ్య, సెక్రటరీ ప్రభుదాస్, కిరణ్, కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే సుచరిత తదితరులు

క్లుప్తంగా

53 మందికి వైద్య పరీక్షలు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): మండలంలోని తిక్కిరెడ్డిపాలెంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్ని అందించారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 53 మంది రోగులు శిబిరానికి హాజరయ్యారు. గర్భవతులు, బాలింతల గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా మాత్రలు అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ నాగ జయంతి, ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా సాగుతున్న పోటీలు



ప్రత్తిపాడు: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు, వేసవి శిబిరంలో నేర్చుకున్న పలు అంశాలపై రోజుకోరకం పోటీల్ని నిర్వహిస్తున్నారు. 1న క్యారమ్స్, 2న జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో కుర్చీలాట, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతపై శనివారం వ్యాసరచనతో పాటు చిత్రలేఖన పోటీల్ని లైబ్రేరియన్ అరుణ నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి 11న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు ఆమె చెప్పారు.

ఆర్వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్ : ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఎల్.ఎన్.కె.సాయి ముడుపుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన 'స్ట్రెంగ్తెనింగ్ అండ్ రిపేర్ ఆఫ్ ఆక్సియాల్లీలోడెడ్ షార్ట్ రీన్ఫోర్స్డ్ కాంక్రీట్ రెక్టాంగులర్ కాలమ్స్ యూజింగ్ జీఎఫ్ ఆర్పీ రాప్' అనే అంశంపై డాక్టర్ సాయిరామ్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి ముడుపును అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్, ఏవో డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ.ఎస్.ప్రసాద్ తదితరులు అభినందించారు.

పాత కక్షలతో దాడి

చేబ్రోలు: పాత కక్షల నేపథ్యంలో ఇంటి పక్కనున్న వారు కర్రలతో దాడి చేసి ఇద్దరిని గాయపరిచిన ముగ్గురిపై శనివారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ జానీబీ ఇంటి పక్కన పఠాన్ బాషా కుటుంబం నివసిస్తున్నారు. రెండు కుటుంబాలకు మనస్పర్థలు ఉన్నాయి. దీన్ని మనసులో ఉంచుకొని పఠాన్ బాషా మరో ఇద్దరు కలసి రాత్రిపూట షేక్ జానీబీ, ఆమె కుమార్తెపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె. ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ప్రత్తిపాడు: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కాసా సత్యనారాయణ (61) ఈ నెల రెండవ తేదీన గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి ఏడు గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. పదహారవ నంబరు జాతీయ రహదారిపై పార్వతీపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న లారీ డ్రైవర్ ఎలాంటి సిగ్నల్ వెయ్యకుండా ఉన్నట్లుండి బ్రేక్ వేశాడు. దీంతో సత్యనారాయణ వెనుక నుండి లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆయన్ను స్థానికులు హైవేలో ఉన్న కాటూరి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని కుమారుడు కాసా వేణుబాబు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

పిల్లల్ని క్రీడల వైపు ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పిల్లల్ని చిన్ననాటి నుంచి క్రీడల వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ముస్తఫా తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి రోజూ కనీసం గంటైనా సమీపంలోని క్రీడా మైదానాల్లోకి పిల్లల్ని తీసుకెళ్లాలని తెలిపారు. స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన ప్రథమ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్ని ముస్తఫా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపడం వల్ల సత్వర ఉపాధి పొందే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మీరావలి, సుబ్బారావు, కాజ, అబ్దుల్ కలామ్ పాల్గొన్నారు.


చిన్నారులకు పతకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు రెయిన్‌బో కల్యాణ్ ఆధ్వర్యంలో శనివారం సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వెస్ట్రన్ డాన్స్ సోలో పోటీలు ఉత్సాహంగా సాగాయి. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. నగరంలోని వివిధ డాన్స్ అకాడమీల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాన్ని సంస్థ ఉపాధ్యక్షులు కె.వి. రమేష్, సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉదయ కుమార్, సభ్యులు రాజా, వెంకట్, కరీమ్, రాజాసింగ్ పర్యవేక్షించారు.


డాన్స్ చేస్తున్న జూనియర్స్

'యూబీఐ ముస్కాన్'పై చిన్నారులకు అవగాహన

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ప్రాంతీయ కార్యాలయంలో శనివారం ఎస్‌బీ ముస్కాన్ స్కీం వినియోగదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూబీఐ డెప్యూటీ రీజినల్ హెడ్ జి.జయజీవన్ మాట్లాడుతూ ఎస్‌బీ ముస్కాన్ అనేది మైనర్ పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకమని తెలిపారు. బ్యాంక్ అందించే వివిధ ఉత్పత్తులు, సేవల్ని వివరించారు. భవిష్యత్ తరాల వారికి బ్యాంకింగ్ విశిష్టతను తెలియజేశారు. పిల్లల పాటలు, రైమ్స్, కథలు చెప్పడం అలరించాయి. సమావేశంలో బ్యాంక్ డీజీఎం జె.అశ్వత్థనాయక్, చీఫ్ మేనేజర్ శ్రీనివాసకుమార్ హరి, శ్యామలానగర్, బృందావన్ గార్డెన్స్ శాఖల మార్కెటింగ్ టీం, బ్రాంచీల హెడ్స్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పిల్లలతో యూబీఐ రీజనల్ హెడ్ జయ జీవన్, అశ్వత్థ నాయక్, శ్రీనివాస కుమార్ హరి

రాష్ట్రపతిని ఆహ్వానించక పోవడం సబబు కాదు

నెహ్రూనగర్: రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎస్సీ, ఎస్టీలను అవమానిస్తున్నారని ఇద్వా(ఐడియల్ దళిత్ ఉమెన్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం 'చలో కలెక్టరేట్' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పార్లమెంటుకు అధిపతి అయిన రాష్ట్రపతిని నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దేశంలో క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, మైనార్టీలపై దాడులు చేస్తుంటే వాటిని నిరోధించకుండా మోదీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పెదగొట్టిపాడు, పెదమక్కెన తదితర ప్రాంతాల్లో అణిచివేతకు గురైన దళితులకు భూముల్ని కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 9 'చలో కలెక్టరేట్' నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోళ్లమూడి రాజసుందరబాబు

రైలు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

గుంటూరు మెడికల్: ఒడిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాద దుర్ఘటన అత్యంత బాధాకరమని భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. మూడు రైళ్లు ఢీకొన్న ఘటనలో 278 మంది ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన 1100 మందికి మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సహాయక చర్యల్ని ముమ్మరం చేసి ప్రాణ నష్టాన్ని నివారించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. దేశ చరిత్రలోనే ఒరిస్సా రైలు ప్రమాద ఘటన అతిపెద్ద దుర్ఘటనగా పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని రూ.25 లక్షలకు పెంచి, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించాలని తోట డిమాండ్ చేశారు. రైలు ప్రమాద ఘటనపై కేంద్రం సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులకు అండగా నిలచి సహాయక చర్యల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బాలాసోర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితలకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన యువత మానవత్వాన్ని చాటి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు.

రైలు పట్టాలపై పంటకు నిప్పు అంటిస్తే కఠిన చర్యలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో కొందరు రైతులు ఎండిన పంటకు ట్రాక్ సమీపంలో నిప్పు పెట్టడం ద్వారి సిగ్నలింగ్ వ్యవస్థపై ప్రభావం చూపి, తద్వారా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన డివిజన్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలుచోట్ల రైల్వే ట్రాక్‌ల వద్ద పట్టాలకు సమీపంలో ఎండిన పంటలకు రైతులు నిప్పు అంటిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే దాన్ని నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. జరిగే నష్టాన్ని రైతులకు వివరించాలని సూచించారు. ట్రాక్ సమీపంలో ఎండిన పంటలకు నిప్పు అంటించి టెలికం వ్యవస్థకు అంతరాయం కలిగించే రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రైలులో ప్రయాణించే వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని రైతులు ఎండిన పంటలను పట్టాలకు దూరంగా తగులపెట్టుకోవాలని ఆయన సూచించారు.

డీపీవో గారూ.. ఒకసారి చూడండి!



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): అధికారుల అంతులేని నిర్లక్ష్యానికి ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రం నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుంది. అవును మీరు చూస్తున్నది నిజమే. ఇది పంచాయతీ రోడ్డే. మురుగు నీరు నిలిచి ఎక్కడో కాదు సిమెంటు రోడ్డు పైనే. ఇదేదో ఒక్క రోజు రెండు రోజుల పరిస్థితి కాదు. నెలల తరబడి గ్రామంలోని వీఆర్వో కాలనీవాసులు ఈ సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నారు. పరిష్కరించండి బాబోయ్.. అంటూ స్థానికులు ఎన్నిసార్లు ఎంతమందికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. నిత్యం మురుగు నీటిలో నడుస్తూ, దోమలతో సహవాసం చేస్తూ నెట్టుకొస్తున్నారు. గ్రామాల్లో స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నామంటూ చెబుతున్న జిల్లా పంచాయతీ అధికారులు ఏ చిత్రం చూసి ఏమి చెబుతారో? ఎలా స్పందిస్తారో? వేచి చూడాలి.

ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఉదయం లక్ష తులసి దళార్చన నిర్వహించారు. రాత్రి ద్వాదశి ప్రదక్షిణలు, పవళింపుసేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ఆయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి: రజక వలంటరీ సర్వీస్ సొసైటీ (ఆర్‌వీఎస్) ఆధ్వర్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన 101 మంది విద్యార్థులకు ఉప కారవేతనాలు, బ్యాగులు, నోట్ పుస్తకాలు, వాటర్ బాటిల్స్, డ్రెస్ మెటీరియల్స్‌ను ఆదివారం పంపిణీ చేయనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు పటేటి శ్రీనివాస్, కొల్లూరు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విద్యార్థులకు వాటిని అందజేస్తారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం, పాతపాటి అంజిబాబు, బొప్పరాజు వెంకటేశ్వర్లు, బండి శ్రీనివాసరావు, విశ్రాంత ఎస్పీ బాల వెంకటేశ్వరరావు, కాకినాడ అడిషనల్ కమిషనర్ నాగనరసింహారావు పాల్గొంటారని తెలిపారు. 96660 35676, 94411 14978 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

6న ప్రతిభా పురస్కారాల ప్రదానం

తెనాలి: ది అమరావతి మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ, 'పోస్ట్' స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6న వివిధ రంగాల్లో ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశానికి హాజరై వచ్చిన విద్యార్థిని గాదిశెట్టి మోహన లక్ష్మీ ప్రియాంక, క్రికెట్ కోచ్ షేక్ కరీముల్లా మాలిక్, యువ వ్యాపారవేత్త హరి బుద్ధ కౌముద్ నారాయణ్, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య, బాడీ బిల్డర్ తన్నీరు లక్ష్మణ్, చార్టర్డ్ అకౌంటెంట్ జొన్నాదుల భార్గవ్, మానవతావాది సూదా పిచ్చయ్య, ప్రతిభా విద్యార్థిని తన్నీరు మానస బిందుకు పురస్కారాల్ని అందజేయనున్నారు. పోస్ట్ సంస్థ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, సొసైటీ చైర్మన్ తన్నీరు నాగమల్లేశ్వరి దేవి శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

తెనాలి రూరల్: పట్టణ రామలింగేశ్వరపేట తోటవారి వీధి-2లోని వ్యభిచార గృహంపై శనివారం వన్‌టౌన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళను రక్షించారు. నిర్వాహకురాలికి సహకరిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

నేడు కళాదర్బార్ సంగీత విభావరి

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పలువురు విశిష్ట వ్యక్తులకు ఎస్పీ బాలు జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానుల పాల్గొనాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ



పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, కుంకుమ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం గజ వాహనంపై స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ఎదుర్కోల ఉత్సవం, తిరుకల్యాణం కన్నుల పండువగా చేశారు. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చల జయప్రకాష్ రెడ్డి, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్ర కుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధరకర్తల మండలి సభ్యులు విశాలక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ఆకట్టుకున్న కళాజాతా

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గుంటూరు ప్రాంతీయ కార్యాలయం పర్యవేక్షణలో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని శనివారం పట్నంబజారులో కళాజాతా నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ ఎవేర్‌నెస్ ఆర్గనైజేషన్ కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం

గుంటూరు రూరల్: జాతీయ రహదారి -16పై టైర్ పంక్చరై నిప్పు రాజుకుని లారీ దగ్ధమైన సంఘటన శనివారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నుంచి తమిళనాడుకు ఇనప లోడుతో వెళుతున్న లారీ టైర్ పంక్చరైంది. ఈ సమయంలో పక్కనే ఉన్న డీజిల్ ట్యాంక్‌కు నిప్పంటుకుని లారీ దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు మంటల్ని అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.